# ప్రపంచ ఆర్థికవేదిక ఎవరి ప్రయోజనం కోసం?

## ఒక విశ్లేషణ

ప్రొ॥ తోట.జ్యోతీరాణి

ప్రపంచాన్ని శాసించే శక్తివంతమైన బడా కార్పోరేటు సంస్థల అధిపతులు, వివిధ దేశాల జాతీయ ప్రభుత్వాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు, ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులు, వీళ్ళందరి ప్రయోజనం కోసం నిరంతరం "నిబద్ధత"తో పనిచేసే దగాకోరు దళారీ వ్యవస్థ మొత్తంగా చేసిన హడావుడి, ఆర్భాటపు ప్రచారాల మధ్య ప్రతీ సంవత్సరం జరిగే ప్రపంచ ఆర్థికవేదిక (World Economic Forum) వార్షిక సదస్సు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జనవరి 23-26, 2018లో జరిగింది. పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాడే ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తుల నిరసన, ప్రతిఘటనా గళాలను బలంగా అణచివేసి, అసలీ సదస్సుకు వ్యతిరేకత ఏమాత్రం లేదన్న బుకాయింపుల మధ్య సభ నిర్వహించబడింది.

### ఈ సదస్సులో ఎవరు పాల్గొంటారు?

తమ సంపదను, ఆధిపత్యాన్ని, పెత్తనాన్ని, అధికారాన్ని పెంచుకుంటూ ప్రపంచ ఆర్థికవ్యవస్థను శాసిస్తూ, దాని గమనాన్ని తమ ప్రయోజనాలకు అనుకూలంగా నిర్దేశించాలన్న లక్ష్యంతో పనిచేసే వాణిజ్య నాయకులు - ప్రపంచంలో అత్యున్నత స్థానంలో వున్న దాదాపు 1000 బహుళజాతి సంస్థల ప్రతినిధులు, 1500 మంది వివిధ దేశాల ప్రభుత్వాలకు సంబంధించిన అధ్యక్షులు, ప్రధాన మంత్రులు, క్యాబినేట్ మంత్రులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థల అధిపతులు, ఉన్నతాధికారులు, రాయబారులు, పౌరసంఘాల ప్రతినిధులు-ప్రధానంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రపంచంలోని శక్తివంతమైన మీడియా నాయకులు, ప్రపంచ ఆర్థిక వేదిక ఆలోచనా చట్రంలో పనిచేసే మేధావులు, మతాధికారులు, మొత్తంగా దాదాపు 100 దేశాల నుండి 2500 మంది ఈ సదస్సులో పాల్గొంటారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థను తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకోవడమే లక్ష్యంగా ఈ వేదిక పనిచేస్తుంది. వార్షిక సభ్యత్వానికే భారీ రుసుము చెల్లించాల్సి వుంటుంది. 2011లోనే వార్షిక సభ్యత్వానికి,

1. వైయక్తిక సభ్యత్వానికి : 52,000 అమెరికన్ డాలర్లు
2. పారిశ్రామిక భాగస్వామి (Industrial Partner) : 2,63,000 అమెరికన్ డాలర్లు
3. వ్యూహాత్మక భాగస్వామి (Strategic partner): 5,27,000. అదనంగా ఒక వ్యక్తికి ప్రవేశ రుసుము 19,000 డాలర్లు.

కాగా 2014లో ప్రపంచ ఆర్థికవేదిక ఈ వార్షిక రుసుమును 20 శాతం పెంచింది. దానితో ఉదాహరణకు వ్యూహాత్మక భాగస్వామిగా అర్హతకు 5,27,000 నుండి 6,28,000లకు పెరిగింది.

కేవలం ఒక సంవత్సరం కోసం వైయక్తిక సభ్యత్వానికి చెల్లించే రుసుము, మన దేశంలోని ఒక పేద కుటుంబపు జీవితకాలపు ఆదాయం కన్నా ఎక్కువే. అయితే లాభం కోసం మాత్రమే పనిచేసే ఈ ఆధిపత్యవర్గం, లాభేతర (Non-Profit) సంస్థగా పరిగణించ బడుతున్న ప్రపంచ ఆర్థికవేదికకు భారీగా రుసుము చెల్లించి, ఎగబడి, సదస్సుకు హాజరుకావడం వైరుధ్యంగా కనిపించినప్పటికీ భారీఎత్తున లభించే ప్రయోజనాలను సులభంగానే అంచనా వేయవచ్చు.

### అసలు ఈ వేదిక, ఎవరిచేత, ఎందుకు ప్రారంభించబడింది?

ప్రపంచ సామ్రాజ్యవాద గుత్తాధిపత్య శక్తుల ఆధిపత్య పోరు పర్యవసానంగా 'ప్రపంచ ఆర్థికవేదిక' ఆవిర్భవించింది. ప్రపంచ మార్కెటు పంపిణీ ఎవరి మధ్య, ఎట్లా వుండాలో నిర్దేశించే లక్ష్యమే ఈ వేదికకు పునాది. 1970 నాటికి ప్రపంచ వాణిజ్యం మీద అమెరికా పెత్తనం స్థిరపడింది. దీనితో యూరప్ వాణిజ్యనాయకులకు తమ వాణిజ్య ఆధిపత్య వారసత్వాన్ని తిరిగి పొందడం ఎలా అన్న ఆవేదన ఎక్కువైంది. దానితో యూరప్‌కు చెందిన బడా వాణిజ్య నాయకులు, తమ సమస్యకు పరిష్కారంగా, "యూరోపియన్ మేనేజ్‌మెంట్ ఫోరం" (European Managment Forum)ని స్విట్జర్లాండ్‌లోని జెనీవా కేంద్రంగా 1971లో ఏర్పాటు చేసుకోవడం గమనించవచ్చు.

నిజానికి, 1970 దశకం అటు ప్రపంచ ఆర్థికవ్యవస్థకూ, ఇటు వర్ధమాన దేశాలకు, అందులో భాగంగా భారతదేశానికీ కీలకమైంది.

గుత్త పెట్టుబడిదారీ దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ గమనంలో తీవ్రమైన లాభత్వ సంక్షోభం ఏర్పడు తుందని, 150 సంవత్సరాల క్రితమే కారల్ మార్క్స్ తన 'దాస్ కాపిటల్' (Das Kapital) గ్రంథంలో స్పష్టంగా వ్యక్తంచేసిన శాస్త్రీయమైన భవిష్యత్ అంచనా మూడవసారి ఋజువైంది, వాస్తవీకరించబడింది. మార్క్స్, కాపిటల్ రాస్తున్న సమయంలోనే 1873-96ల మధ్య కాలంలో సుదీర్ఘ ఆర్థికమాంద్యం ఏర్పడింది. ఇక రెండవది, 1929-39ల మధ్య కాలంలో, సార్థక డిమాండ్ కొరత వల్ల ఏర్పడిన ప్రపంచ ఆర్థికమాంద్యం (Great Depression) కాగా, స్తబ్దత - ద్రవ్యోల్బణం మిశ్రమంతో (Stagflation) 1973- 80ల మధ్య ఏర్పడిన సీరియస్ లాభత్వ సంక్షోభం మూడవది. ఈ సంక్షోభం నుండి బయటకు రావటానికి, తన దోపిడీ, పీడనలను నిరాటంకంగా కొనసాగించడానికి కావలసిన పరిస్థితులను సృష్టించుకునే దృష్ట్యా కొత్తపెట్టుబడిదారీ వ్యవస్థ తనను తాను సర్దుబాటు (Restructure) చేసుకొని,

పునర్నిర్మించుకుంటుందని మార్క్స్ కాపిటల్ స్పష్టంగానే చెప్పటం తెలిసిందే. ఇట్లా, ఈ క్రమంలో ఆవిర్భవించిన యూరోపియన్ మేనేజ్‌మెంట్ వేదిక, ప్రపంచ సంక్షోభాన్ని బలంగా ఎదుర్కొనే లక్ష్యంతో 1987లో 'ప్రపంచ ఆర్థికవేదిక' రూపం తీసుకున్నది, బలపడింది కూడా. లాభత్వ సంక్షోభానికి పరిష్కారంగా నయా ఉదారవాద (Neo Liberal) విధానాలను ముమ్మరం చేయటంలో తన వంతు కృషిని సీరియస్‌గా చేసింది. గ్లోబలైజేషన్ క్రమం ఏర్పడింది. పర్యవసానంగా గ్లోబల్ పెట్టుబడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తన గుప్పిట్లోకి తీసుకున్నది.

కాగా 1970 దశకంలోనే భారతదేశ ఆర్థికవ్యవస్థ గమనం, 'స్వతంత్ర' భారతదేశం ప్రకటించుకున్న "సామ్యవాదరీతి సమాజ స్థాపన" దిశగా లేదన్న వాస్తవాన్ని స్పష్టంగా గుర్తించడం గమనించవచ్చు. 1970లలోనే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారు తన సునిశిత పరిశీలన, అధ్యయనాలలో భారతదేశ ఆర్థికనిర్మాణాలు వక్రీకరణకు గురవుతున్నాయని, స్వావలంబనకు వ్యతిరేకదిశలో వాటి గమనం వున్నదని, విదేశీ పెట్టుబడి శక్తుల నియంత్రణలోనే ప్రభుత్వ రంగంతో సహా మొత్తం పారిశ్రామిక రంగం వున్నదని, అసలు భారతదేశమే తాకట్టులో వున్నదని "తాకట్టులో భారతదేశం"లో చాలా స్పష్టంగా వ్యక్తం చేశారు. ఆర్థిక నిర్మాణాల వక్రీకరణ ఫలితంగా ఉద్యోగకల్పన అసాధ్యమైంది. నిరుద్యోగ భారతదేశంలో పేదరికం, ఆకలి, పౌష్టికాహారలోపం సమస్యలు తీవ్రమైనాయి. ఇదే దశకంలో ఈ అంశం గురించి దండేకర్, రాథ్ మొదలైన ఆర్థికవేత్తలు సీరియస్‌గా అధ్యయనం చేసి, వాస్తవాలను వెల్లడించారు. దోపిడీ, పీడన, హింసలేని సమసమాజాన్ని ఏర్పరచటమే నిజంగా మన పాలకవర్గం లక్ష్యమైనట్లయితే ఈ వక్రీకరణను సరిదిద్దుకునే ప్రయత్నాలు జరిగివుండేవి. కాని అప్పటికే విదేశీ కార్పోరేటు గుత్త పెట్టుబడుల ప్రయోజనాల కోసం దళారీగా పనిచేస్తున్న మన పాలకవ్యవస్థ, లాభత్వ సంక్షోభానికి పరిష్కారంగా అప్పటికే బలంగా ప్రచారమైన నయా ఉదారవాద విధానాలను అమలుపరిచింది. లైసెన్సింగ్ విధానాలను, విదేశీ పెట్టుబడుల నియంత్రణ విధానాలను సరళీకరిస్తూ పారిశ్రామిక విధానాలను రూపొందించింది. 1990- 91లో నూతన ఆర్థికవిధానం పేరిట గ్లోబలైజేషన్ ప్రవేశాన్ని ఆహ్వానించి, విదేశీ కార్పోరేటు గుత్త పెట్టుబడులకు భారతదేశ ఆర్థికవ్యవస్థను ఎర్ర తివాచీ పరిచి మరీ ఒప్పగించటమూ జరిగింది.

లాభత్వ సంక్షోభానికి పరిష్కారం అంటే లాభాలు పెంచుకోవడమే కదా! లాభాలు ఎక్కడి నుండి వస్తాయి? వాటి మూలం ఏమిటి? శ్రమదోపిడీ, పర్యావరణ దోపిడీలే కదా లాభాలకు మూలం. అందువల్ల గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభానికి పరిష్కారంగా ఆవిష్కరించబడిన గ్లోబలైజేషన్ క్రమం వల్ల పీడిత ప్రజల బ్రతుకులు ఏమవుతాయి? తీవ్రస్థాయిలో నిరంతరం దోపిడీకి గురవుతున్న పర్యావరణం ఏమవుతుంది? పీడిత ప్రజల బ్రతుకే సంక్షోభమవుతుంది. జీవనోపాధిని కోల్పోతారు, సంపాదన వుండదు, దుర్భర దారిద్ర్యంలో బ్రతుకుతూ, నిస్సహాయంగా సంపాదన పనులకోసం నిలబడ్డ పేదలంటే, మరింత దోపిడీకి, పీడనకు పెట్టుబడి దారులకు అవకాశం వున్నట్టే కదా! ఇక పర్యావరణ దోపిడీ వల్ల సమిష్టి ఆస్తివనరులు, అడవులు అంతరించి పేదల బ్రతుకులు మరింత సంక్లిష్టమైనాయి. ఒకవైపు మూలధనం యొక్క లాభదాహం వల్ల సృష్టించబడిన సంపద పెట్టుబడిదారీ వర్గం చేతిలో కేంద్రీకృతం అవుతూనే వుంటుంది. ఫలితంగా శ్రామికవర్గం, నిరుద్యోగిత, అల్పోద్యోగితలతో శ్రామిక రిజర్వు ఆర్మీ ఏర్పడుతుంది. పేదరికంతో మనుగడను కొనసాగించవలసి వుంటుంది. ఈ విషయాన్ని 150సంవత్సరాల క్రితమే కారల్‌మార్క్స్, తన 'దాస్ కాపిటల్'"లో సరిగ్గానే అంచనా వేశాడు. మన కళ్ళముందున్న వాస్తవాలు అవే.

పీడిత వర్గం ఏకమై నిర్మించుకునే బలమైన సంఘటిత పోరాటాల ద్వారా మాత్రమే దోపిడీ వ్యవస్థను నిర్మూలించడం, దోపిడీ నుండి విముక్తం కావటం సాధ్యమవుతుందని మార్క్స్ బలంగా సూచించాడు. కాని ఇది ఆచరణ వాస్తవం కాకుండా వుండటానికి ఆలోచనా ధోరణి మీద, సాంస్కృతిక నిర్మాణాల మీద ఈ వేదిక బలమైన దాడిచేస్తుంది. సమాజ సంస్కృతిని, ఆలోచనలను ఆధిపత్య వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకుంటుంది.

## ప్రపంచ ఆర్థిక వేదిక ఏ విషయాలను చర్చిస్తుంది? ఎటువంటి నిర్ణయాలను అమలు చేస్తుంది?

ఇది లాభేతర (Non-Profit) ఫోరం అని చెప్పబడినప్పటికీ లాభాలతోనే ముడిపడివున్న ప్రపంచ వాణిజ్యాన్ని శాసిస్తుంది, శాసించగలదు. ప్రపంచస్థాయి స్థానికస్థాయి నిర్ణయాలు తీసుకోవడానికి గాని, అమలుపరచడానికి గాని ఈ ఫోరంకు ఎటువంటి చట్టపరమైన అధికారాలు లేవు. ప్రపంచ ఆర్థికవ్యవస్థను నియంత్రించే సంపన్న వర్గాల, బడా కార్పోరేటు పెట్టుబడుల వాణిజ్యశక్తులతో కూడిన "రహస్య కుట్రదారుల ముఠా"గా ఈ వేదిక శక్తివంతంగా పనిచేస్తుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల, బహుళజాతి సంస్థల ప్రయోజనం కోసం గ్లోబల్ ఆర్థికవ్యవస్థను ఏ విధంగా సమీకరించాలో, అందుకు అనుగుణమైన పరిస్థితులను ఎట్లా సృష్టించాలో అన్నదే ఈ వేదిక ఎజెండా. ఇందుకోసం శ్రామికవర్గాన్ని, పేదప్రజలను, వ్యవసాయాన్ని, పర్యావరణాన్ని, స్థానిక సంస్కృతులను విధ్వంసం చేయడానికిది సన్నద్ధమవుతుంది.

అందుకే ఈ వేదికను 'మేకతోలు కప్పుకున్న తోడేలు' అంటారు. గ్లోబల్ మూలధనం శక్తిముందు మెజారిటీ ప్రజల బ్రతుకులు, వ్యవసాయం, పర్యావరణం, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు అన్నీ పనికిరానివే అంటుందీ వేదిక. అన్ని రంగాలలో ప్రపంచంలో అత్యున్నత స్థానంలో వున్న వాళ్ళందరూ కలుసుకోవడానికి, ప్రపంచ ఆర్థికనిర్మాణాలను తమ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించే దిశగా చర్చలు చేసుకోవడానికి కావలసిన అనుకూల వాతావరణాన్ని ఈ వేదిక కల్పిస్తుంది. బడా కార్పోరేటు శక్తుల, ప్రపంచ వాణిజ్య నాయకుల, సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యాన్ని బలోపేతం చేయడానికి నిరంతరం అధికారికంగా కృషి చేసే

ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF), ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలైన వాటికి బలమైన మద్దతునిస్తుంది, వెన్నుదన్నుగా నిలుస్తుందీ వేదిక, బలమైన పునాదిని ఏర్పరుస్తుంది కూడా.

## ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించే నివేదికలు, చర్చించిన అంశాలు, పరిష్కార మార్గాలు ఏమిటి? అవి ఎవరి ప్రయోజనం కోసం?

ప్రపంచ ఆర్థికవేదిక పక్షాన బలంగా ప్రచారంలో వున్న నివేదిక "ప్రపంచ అసమానతల నివేదిక" (World Inequality Report). ప్రపంచ సంపద పంపిణీలో అసమానతల తీవ్రతనిది వ్యక్తంచేస్తుంది. పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మరియు బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్శిటీల సహకారంతో ప్రపంచ అసమానతల ల్యాబ్, ఈ నివేదిక రూపొందించింది. 1980ల నుండి అసమానతల తీవ్రత పెరిగిందని ఈ నివేదిక వ్యక్తం చేస్తుంది. అంటే నయా ఉదారవాద విధానాల (Neo Liberal Policies) అమలు బలోపేతం కావడంతో అసమానతలు తీవ్రమైనాయనే కదా!

ఇదే అంశం మీద ఆక్స్‌ఫాం మరొక నివేదికను రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచంలోని 3.6 బిలియన్ల ప్రజల సంపదకు సరిసమానమైన సంపద కేవలం అంటే కేవలం 8 మంది చేతిలో కేంద్రీకృతమైవున్నది. ప్రపంచంలోని క్రిందిస్థాయి 50 శాతం ప్రజల సంపద కంటే ఉన్నతస్థాయి ఒక్క శాతం సంపన్నుల సంపద రెండు రెట్లు అధికంగా వున్నది. ఈ నివేదిక ప్రకారమే, 2017లో సృష్టించబడిన సంపదలో 82శాతం, ఉన్నతస్థాయికి చెందిన కేవలం ఒక్క శాతం సంపన్న వర్గం స్వాధీనం చేసుకున్నది. పైగా క్రిందిస్థాయి 50 శాతం మందికి అసలిందులో వాటానే లేదు. నిచ్చెనమెట్ల ఆర్థిక నిర్మాణాలు ఎంత బలపడుతున్నాయో ఇది సూచిస్తుంది.

అందుకే ఈ నివేదిక "శ్రమకు ప్రతిఫలం దక్కాలి, సంపదకు కాదు" అంటుంది. కాని, సంపద పంపిణీ సూత్రాలలో ఎటువంటి మార్పులు అవసరమో చెప్పదు. పైగా, ప్రభుత్వం నుండి ప్రైవేటుకు సంపద తరలి వెళ్తుందని, అందువల్ల ప్రభుత్వం బలహీనమవుతుందని, సమర్థవంతంగా పనిచేయలేదని ప్రపంచ ఆర్థికవేదిక చెబుతుంది. కొత్త పెట్టుబడి శక్తుల చేతిలో సంపద అసాధారణ కేంద్రీకరణకు, ప్రభుత్వం నుండి వివిధ రూపాలలో సంపద తరలివెళ్ళడం ఒక కారణం అని అంగీకరించదు సరికదా, ఆర్థికంగా బలహీనపడిన ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను సమర్థవంతంగా నిర్వహించటంలో విఫలమవుతాయని, అందువలన, ఈ రంగాలను కార్పోరేటీకరించాలంటుందీ వేదిక. పర్యావరణ పరిరక్షణలో కూడా ప్రభుత్వం విఫలమైందని చెబుతుంది. సంపద కేంద్రీకరణకు కారణాలైన నయా ఉదారవాద విధానాలను, ప్రైవేటు కార్పోరేటు శక్తుల ఆధిక్యతను ఎక్కడా ప్రస్తావించదు.

ప్రపంచ సంపద పంపిణీలో అసమానతలు తీవ్రతరం కావడాన్ని ఈ వేదిక ఒక ప్రమాదం అనే భావించదు. ఇది సహజం, ఆమోద యోగ్యం అంటుంది. అందువల్లనే, ఈ వేదిక రూపొందించే "ప్రపంచ ప్రమాదాల నివేదిక" (Global Risks Report) గుర్తించిన సీరియస్ ప్రమాదాలలో సంపద పంపిణీలో అసమానత, మెజారిటీ ప్రజల దుర్భర దారిద్ర్యం లేవు. వాతావరణానికి సంబంధించిన తీవ్రమైన సంఘటనలు (Extreme Weather Events) ప్రకృతి వైపరీత్యాలు (Natural Disasters), సామూహిక వినాశనానికి కారణం అవుతున్న మారణాయుధాలు (Weapons of Mass Distruction)); వీటికి అదనంగా నీటి సంక్షోభం, నిర్బంధ వలసలు, జీవవైవిధ్యత నాశనం కావటం, సైబర్ దాడులను ద్వితీయశ్రేణి ప్రమాదాలుగా గుర్తిస్తుంది. వీటిలో మెజారిటీ ప్రమాదాలు పర్యావరణ విధ్వంసానికి సంబంధించినవే. గుత్త పెట్టుబడిదారీ ఆర్థిక నిర్మాణాల లాభదాహంతో జరుగుతున్న పర్యావరణ దోపిడీ వల్లనే ఈ గ్లోబల్ ప్రమాదాలు ఏర్పడుతున్నాయన్న వాస్తవాన్నది గుర్తించదు, ప్రస్తావించదు. పైగా పర్యావరణ కాలుష్యం సృష్టించే వివిధ సమస్యలకు వాణిజ్య పరిష్కారాలను సూచిస్తుంది. గుత్తసంస్థల లాభాపేక్ష వల్ల సమస్యలు సృష్టించబడితే, ఆ సమస్యలను వ్యాపార సరుకుగా మార్చుకొని మళ్ళీ లాభపడాలనుకుంటుంది. గుత్తపెట్టుబడి సృష్టించిన వాయు కాలుష్యానికి పరిష్కారంగా గాలిశుద్ధి కోసం పరికరాలు తయారవుతాయి, విక్రయించబడతాయి. శుద్ధమైన గాలి మార్కెటు సరుకవుతుంది. ఇదే విధమైన పరిస్థితిని రక్షిత మంచినీటి విషయంలో కూడా గమనించవచ్చు. నీళ్ళను, గాలిని కూడా మార్కెట్ సరుకుగా చేసుకుని గుత్తపెట్టుబడి సొమ్ము చేసుకుంటుందని గూగీ వా థియాంగో నవల "మట్టికాళ్ళ మహారాక్షసి"లో స్పష్టంగా చెప్పబడింది. అసలు అసమానతలు, వాటి ప్రభావాలు, మెజారిటీ ప్రజల జీవనవిధ్వంసం, మొదలైన సీరియస్ సమస్యలను ఈ వేదిక రూపొందించే ప్రపంచ ప్రమాదాల నివేదికలో ప్రస్తావించనేలేదు.

అంటే అసమానతలు సహజమైనవే అన్నమాట. దీనికి ప్రజలందరూ ఏంచేయాలి? సంపద కేంద్రీకరణ గొప్పదని, సంపన్నులంటే గొప్పవాళ్ళని ప్రచారం చేయాలి. ఈ క్రమంలోనే గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ కుబేరుల గురించిన సమాచారం బాగా ప్రచారం అవుతూ వచ్చింది. ప్రపంచ కుబేరులెవ్వరు? అందులో మొదటిస్థానం ఎవరిది? ఆ వ్యక్తి ఎంత సంపన్నుడు? మన దేశంలో ఎంతమంది కుబేరులున్నారు? వాళ్ళ సంపద ఏ స్థాయిలో వున్నది? మొదటిస్థానం దక్కించుకున్న దెవరు? ఈ అంశానికి సంబంధించిన సమాచారం విస్తృతంగా ప్రచారం కావడంతో సంపద కేంద్రీకరణ, సంపద పంపిణీలో అసమానతలు గొప్ప విషయాలుగా చెలామణిలోకి వచ్చాయి. సంపద కోసం, దానితోపాటు సమకూరే ఆడంబరమైన జీవితం కోసం వెంపర్లాట ఎక్కువైంది. దీనికోసం సమాజంలోని ప్రజలందరూ ఎవరి స్థాయిలో వాళ్ళు, ఏ మార్గంలోనైనా సంపన్నులు కావాలన్న ఆరాటం తీవ్రమై, వ్యవస్థీకృతం అయ్యే పరిస్థితులు బలపడ్డాయి.

అసలు దుర్భర దారిద్ర్యంలో ఎంతమంది ఎటువంటి అగౌరవ, అమానవీయ పరిస్థితులలో జీవిస్తున్నారో సమాచారం

వుండదు, మీడియాకు పట్టదు. పేదరికంలో మగ్గుతున్న మెజారిటీ ప్రజలు ఏం చేయాలి? మన దేశంలో కుబేరులు, వాళ్ళసంపద, వాళ్ళ ఆడంబర జీవితం మీడియాలో, సోషల్ మీడియాలో చూస్తూ తమస్థితిని మరచిపోయి గర్వపడాలన్నమాట.

అసలు సంపదను సృష్టిస్తున్నదెవ్వరు? సంపన్న వర్గం దగ్గర సంపద ఎందుకు, ఎలా పోగుపడుతున్నది, ఎట్లా కేంద్రీకరించబడుతున్నది? దీని పర్యవసానం ఎట్లా వుంటుంది? అన్న ప్రశ్నలే వుండవు ప్రపంచ ఆర్థికవేదిక సదస్సుల్లో.

అసమానతలు ఆమోదయోగ్యమైనాయి, అభినందించదగిన విషయాలైనాయి. సమానత్వ భావనే కాలం చెల్లిందయింది. సమానత్వం అన్నమాటే పరిహసించబడే పరిస్థితులు బలపడ్డాయి. వ్యక్తిగత మేధస్సు, నైపుణ్యాల వల్లనే సంపద సమకూరుతుందని, పేదరికానికి ఎవరికి వారే బాధ్యులన్న వాదన బలపడింది.

సంపదను పెంచుకోవడం, దానితో ముడిపడి వున్న ఆడంబరాలు, ఆధిక్యత, ఆధిపత్యం, పెత్తనం, తన కంటే బలహీనులని సకల విధాలుగా అవహేళన చేయడం, అవమానపరచటం, హింసించటం సర్వ సాధారణమైంది. మానవవిలువలు అంతరిస్తున్నాయి. మానవీయతే బలహీనతకు చిహ్నం అయింది.

దీనితో నిచ్చెనమెట్ల సమాజం మరింత బలపడింది. ఆధిపత్య – అధీనత్వ సంబంధాలు బలోపేతమైనాయి. ప్రతీవ్యక్తి తనకంటే బలవంతుని ముందు బలహీనుడే. తనకంటే బలహీనుల ముందు బలవంతుడే. భయం, భయంగా పిరికితనంతో బలవంతుని ముందు ప్రవర్తించే వ్యక్తే, తనకంటే బలహీనుల ముందు భయంకరమైన పెత్తనం చెలాయించడం మనం చూస్తూనే వున్నాం. దీంతో కుల అంతరాలు, మతం పెత్తనం, జెండర్ వివక్ష అన్నీ బలపడ్డాయి.

తీవ్రమవుతున్న అసమానతలను అభినందించి, ఆమోదించే ఆలోచనా ధోరణిని బలపరచడంలో మతాధికారులు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు కీలకంగా పనిచేస్తున్నాయి. అందువల్లనే శక్తివంతమైన మీడియా అధినేతలు, బలమైన మతాధికారులతో పాటు ఆర్థిక నిర్మాణాల గురించి అసలే ప్రస్తావించకుండా అసమసమాజంలో తలెత్తే రకరకాల సమస్యలను వేటికి వాటినే పైపైన (Peripheral) చూస్తూ ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కనిపించే స్వచ్ఛంద సంస్థలు అన్నీ ప్రపంచ ఆర్థికవేదికలో భాగస్వాములే.

తీవ్రమవుతున్న అసమానతలను ఆమోదించే సమాజంలో "దానధర్మాలు" ప్రశంసించవలసిన అంశాలవుతాయి. సంపదను పోగేసుకున్న సంపన్నవర్గం దాతృత్వం మీదనే పేద ప్రజల మనుగడ ఇక. అందుకే చారిటబుల్ ఫౌండేషన్స్‌కి ప్రాధాన్యత వుంటుందీ వేదికలో. సమానత్వం గురించి, హక్కుల గురించి పోరాటాలు వుండవిక. సంపన్నవర్గాల సంపదను చూసి ప్రజలందరూ ఉబ్బితబ్బిబ్బు కావాలి. వాళ్ళ దాతృత్వం కోసం వెంపర్లాడాలి. వేలకోట్ల రాయితీలను బడా కార్పోరేటు శక్తులకిచ్చే మన ప్రభుత్వం, కార్పోరేటు సోషల్ రెస్పాన్సిబిలిటీ పేరిట బడా కార్పోరేటు సంస్థల లాభాలలో 2 శాతాన్ని సామాజిక సమస్యల కోసం కేటాయించాలని బ్రతిమిలాడు కుంటుంది. "కార్పోరేటు సంస్థల సామాజిక బాధ్యత"ను పొగుడ్తూ విశ్వవిద్యాలయాల్లో, అకడమిక్ సంస్థలలో సదస్సులకు కొదవేం లేదు.

## సంపదకు కాదు, శ్రమకు ప్రతిఫలం వుండాలన్న ఆక్స్‌ఫాం సూచన అమలుకు తీసుకున్న చర్యలేమైనా వున్నాయా?

అసమానతలు లేని భవిష్యత్తును రూపొందించ డానికి ప్రపంచ ఆర్థికవ్యవస్థ డిజైన్‌నే మార్చాలంటుంది ఆక్స్‌ఫాం నివేదిక. పైగా కష్టపడి చేసే శ్రమకు (Hardwork) ప్రతిఫలం వుండాలంటుంది. కాగా, ఇందుకు విరుద్ధమైన అంశాలు మానవ మూలధన నివేదిక, 2017లో స్పష్టంగా కనిపిస్తాయి. ఈ అంశంలో భారతదేశం స్థానం 101/130.

వలస కార్మికుల శ్రామికులతోనే అభివృద్ధి సాధ్యం అంటుందీ నివేదిక. వలస వచ్చిన శ్రామికులు అణిగిమణిగి వుండి, ఇంకా ఎక్కువ పనిని తక్కువ జీతానికి కూలీకి పనిచేస్తారు కదా! శ్రమదోపిడీ తీవ్రతను పెంచటమే అభివృద్ధి సూత్రం, నిర్వచనం అయినపుడు అభివృద్ధి అంటే బడాకార్పోరేటు శక్తుల అభివృద్ధి కోసం వలస శ్రామికులు అవసరమవుతారు. "బానిసలు లేకుండా రోమ్ నగరం నిర్మించబడేదా" అంటూ బానిసవ్యవస్థను సమర్థించిన అరిస్టాటిల్‌ని ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవలసి వుంటుంది.

అంతేకాదు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ద్వారా దళారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని దళారీవ్యవస్థను అభినందిస్తుందీ నివేదిక. శ్రమదోపిడీని తీవ్రతరం చేయటమే సమర్థవంతమైన చర్య అని ఈ వేదిక బలంగానే ప్రచారం చేస్తుంది. భారతదేశంలో రెగ్యులర్ ఉద్యోగాలు క్రమంగా అదృశ్యమై, కాంట్రాక్ట్ శ్రామికులు, ఔట్‌సోర్సింగ్ శ్రామికులతో అన్ని కార్యకలాపాలు నిర్వహించబడడం, వలసలు విపరీతంగా పెరుగుతూ, వలస కార్మికులు దయనీయమైన స్థితిలో భయంకరమైన దోపిడీ పీడనలకు గురవుతున్న తీరు మనందరికీ తెల్సిందే. శ్రమదోపిడీని తీవ్రతరం చేసే ఉద్యోగితాధోరణి ఆధిపత్య శక్తుల సంపదను పెంచుతుంది, అసమానతలను తీవ్రతరం చేస్తుంది. పైగా అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలంటూ "సమ్మిళిత వృద్ధి సూచీ (Inclusive Development Index) ని రూపొందించడం ఒక సీరియస్ వైరుధ్యం.

## సమ్మిళిత వృద్ధిసూచీ (Inclusive Development Index)

గ్లోబలైజేషన్ క్రమానికి మానవముఖం రావాలన్న తపనతో వున్న జోసెఫ్ స్టిగ్లిజ్, అమార్త్యసేన్‌ల సహకారంతో సమ్మిళిత వృద్ధి సూచీని ప్రపంచ ఆర్థికవేదిక రూపొందిస్తుంది. స్థూల దేశీయోత్పత్తికి ఆవల 11 కోణాలతో (Dimensions) 103 దేశాల ఆర్థిక నిర్వహణ తీరును ఈ సూచీ అంచనావేస్తుంది. ఆర్థికవృద్ధి వున్నప్పటికీ సమ్మిళిత సామాజికవృద్ధి లోపిస్తున్నదన్న విషయాన్ని

అంచనా వేయడం ఈ సూచీ లక్ష్యం. 2018లో ఇందులో భారతదేశ ర్యాంక్ 62/103. ఏ సమాజానికైనా, వృద్ధి, అభివృద్ధి, సమ్మిళిత వృద్ధి, అంతర్ తరాల మధ్య సమత్వం (inter generation equality) మూలస్తంభాలు అంటుందీ సూచిక.

## సమ్మిళిత వృద్ధికోసం ఈ వేదిక బలంగా ప్రతిపాదించే సాధనాలు ఏమిటి?

ఏ స్వేచ్ఛా మార్కెటు వల్ల సమ్మిళితవృద్ధికి వ్యతిరేకదిశలో ఆర్థిక వ్యవస్థ గమనం నిర్ణయించ బడుతున్నదో అదే స్వేచ్ఛా మార్కెట్ (Free market)ను సమ్మిళిత వృద్ధికి సాధనంగా ఈ వేదిక ప్రతిపాదించడం సీరియస్ వైరుధ్యం. పోటీ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి గమనంలో పోటీ పూర్తిగా అంతరించి గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరపడి, బలపడిన ప్రస్తుత సందర్భంలో స్వేచ్ఛా మార్కెటు ద్వారా న్యాయమైన (Fair) సంపద పంపిణీ ఎట్లా సాధ్యమవుతుంది?

సంపద పంపిణీలో అసమానతలు తీవ్రం కావడానికి, అసమ్మిళిత వృద్ధి వల్ల సామాజిక సంక్షోభం ఏర్పడటానికి మూలధనానికి పంపిణీ సూత్రాలు అతిగా అనుకూలంగా వుండడం కారణమని ఒకవైపు చెబుతూ, మరొకవైపు ఈ ధోరణినే బలోపేతం చేసే గ్లోబల్ వాణిజ్యాన్ని పరిష్కారంగా ప్రతిపాదించడం ఈ వేదిక ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తుందో దానంతటదే స్పష్టమవుతుంది. స్వేచ్ఛాయుతమైన గ్లోబల్ వాణిజ్యమే సమాజ ఆరోగ్యాన్ని రక్షిస్తుందంటుంది. వాణిజ్యంలో అక్రమ అనైతిక పద్ధతులే (Unfair trade practices) అంటే ఆర్థికవ్యవస్థలో ప్రణాళికల ద్వారా ప్రభుత్వ జోక్యం వల్ల గ్లోబల్ మార్కెట్లు వక్రీకరణకు గురై అసమ్మిళిత వృద్ధికి కారణం అని ఈ వేదిక అభిప్రాయం. నయా ఉదారవాద విధానాల వల్ల బలపడిన గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థనే నిజానికి అసమ్మిళిత వృద్ధికి కారణం. కాగా అదే వ్యవస్థను మరింత బలోపేతం చేయడం వల్ల సమ్మిళితవృద్ధి సాధ్యమవుతుందని చెప్పడం పీడితవర్గాన్ని పరిహసించడమే.

పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే ఈ అసమానతలు, అదే ఆర్థిక నిర్మాణ చట్రంలో పరిష్కరించబడవని 150 సంవత్సరాల క్రితమే మార్క్స్ తన 'దాస్ కాపిటల్'లో స్పష్టంగా వ్యక్తంచేసిన విషయం మనకు తెలిసిందే.

కాని ఏ నయా ఉదారవాద విధానాలు, ఏ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల ప్రపంచ ప్రజల బతుకులు పెద్దప్రమాదం బారిన పడ్డాయో, అవే విధానాలను వ్యతిరేకించడమే ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద ముప్పు అంటూ మన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జనవరి 2018లో జరిగిన ప్రపంచ ఆర్థికవేదిక సమావేశంలో ఉపన్యసించడం దేనిని సూచిస్తుంది? అసలు వర్ధమాన దేశాల ప్రభుత్వాలు తన కీలు బొమ్మలని ప్రపంచ ఆర్థికవేదిక చెబుతుంది. వాణిజ్య ప్రయోజనాలకు, కార్పోరేటు శక్తులు బలపడడానికి వేదిక తీసుకునే ప్రతీ నిర్ణయానికి అనుకూలంగా వర్ధమాన దేశ ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందిస్తాయని, ఒత్తిడి చేయడం చాలా సులభమని ప్రపంచ ఆర్థికవేదిక చెప్పడం సాహసం ఎట్లా అవుతుంది మరి?

## పేద ప్రజల మానవాభివృద్ధి – ఆదాయం, విద్య, ఆరోగ్యంకోసం ప్రపంచ ఆర్థిక వేదిక నిర్ణయాలు ఏమిటి?

ఐక్యరాజ్య సమితి 2000 సంIIలో ప్రకటించిన మిలీనియం అభివృద్ధి లక్ష్యంలో ఒకటైన "సంపూర్ణ అక్షరాస్యత", 18 సంవత్సరాల తర్వాత కూడా అసంపూర్ణ ఎజెండాగా మిగిలిపోయిన ప్రస్తుత సందర్భంలో ఈ అంశాన్నే ప్రస్తావించకుండా డిజిటల్ విద్య గురించి ఈ వేదిక చర్చిస్తుంది. ఈ సందర్భంగా, సుస్థిరాభివృద్ధి కోసం బ్రాడ్‌బ్యాండ్ కమీషన్ (UN Broad Band Commission for Sustainable Development), 2025 నాటికి 3.8 బిలియన్ల మందిని ఇంటర్‌నెట్‌తో అనుసంధానం చేయడం లక్ష్యం అని ప్రకటిస్తుంది.

ఇంటర్నెట్‌ని అందుబాటులోకి తేవడం, దాని ఉపయోగితను పెంచడం, బ్రాడ్‌బాండ్ అవస్థాపనను పెంచడం– ఈ దిశగా వాణిజ్య శక్తులిక లాభపడతాయన్నమాట. ప్రపంచ యువతలో కనీసం 60 శాతానికి సుస్థిరమైన డిజిటల్ నైపుణ్యం వుండాలి అంటుంది. 2021 నాటికి ఒక మిలియన్ మందికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించిన నైపుణ్యాలను అందజేయడానికి చొరవ తీసుకుంటున్నట్లు ఈ వేదిక ప్రకటిస్తుంది.

ఆహార భద్రతకూ వాణిజ్య పరిష్కారాలనే సూచిస్తుంది. మాంసం, ప్రొటీన్లతో కూడిన ఆహార ఉత్పత్తులను విక్రయించాలంటుంది. ఆకలితో అలమటించే అసంఖ్యాక పేదవర్గం మాటేమిటి? అసలు ఆహారభద్రత ఎవరి సమస్య?

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ ప్రజలకు టాయిలెట్ వసతుల్లేవు. కారణం ఏమిటో జగమెరిగిన సత్యమే. వుండడానికి ఇళ్ళు లేక ఫ్లాట్ ఫాంల మీద, రోడ్ల మీద, మురికివాడలలో బ్రతుకులెన్నో? హానికరమైన ప్రమాదకరమైన పరిస్థితులలో మెజారిటీ శ్రామికులు భారతదేశంలో పనిచేయవలసి వస్తున్నదని, దీనిని నిర్మూలించాలని, గౌరవప్రదమైన ఉపాధి కల్పించాలని అంతర్జాతీయ కార్మికసంస్థ (ILO) హెచ్చరిస్తూనే ఉన్నది.

కాగా టాయిలెట్ సమస్యను వాణిజ్య ప్రయోజనాల కోసం ఎట్లా మలచుకోవచ్చునో ప్రపంచ ఆర్థికవేదిక చర్చిస్తుంది. టాయిలెట్ డిజైన్లలో నవకల్పనలు, కొత్త నమూనాల గురించి, ఇందులో లభించే వ్యాపార అవకాశాల గురించి చర్చిస్తుంది.

ఆరోగ్యసేవలు ప్రజలకు అందకపోవడాన్ని వేదిక గుర్తిస్తుంది. కాని ఇందుకు కారణం ఆరోగ్యసిబ్బంది కొరత అని వాదిస్తుంది. వైద్య విద్యను, హాస్పిటల్స్‌ను – మొత్తంగా ఆరోగ్యరంగాన్ని కార్పోరేటీకరించటమే సమస్యకు పరిష్కారం అంటుంది. ఏ సమస్యయితే ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ వల్ల ఏర్పడిందో, ఏవస్తువైతే, అందువల్ల అందుబాటులోకి రాకుండా పోయిందో, ఆ వస్తువును మార్కెటు సరుకుగా మార్చడం, వాణిజ్యీకరించటం, పరిష్కారమని ప్రపంచ ఆర్థికవేదిక బలంగా చెబుతుంది. వాణిజ్యీకరణను

బలోపేతం చేసి, బడా కార్పోరేటు శక్తుల, ప్రపంచ వాణిజ్య నాయకుల సంపదను, ఆధిపత్యాన్ని పెంచటమే లక్ష్యంగా పనిచేసే ప్రపంచ ఆర్థికవేదిక సూచించే పరిష్కార మార్గాలు ఇందుకు విభిన్నంగా వుండవు. ప్రతీ సమస్యకూ శ్రమ దోపిడీని మరింత తీవ్రతరం చేయటమే, అందుకు కొత్తరంగాలను ఎట్లా మార్కెటీకరించాలి, శ్రమదోపిడీ కొత్త రూపాలను ఎట్లా ఆవిష్కరించుకోవాలన్నదే ఈ వేదిక సమస్య. ఇందుకు అనుగుణమైన ప్రతిపాదనలు, నిర్ణయాలు, పరిష్కారసాధనాలు వుంటాయి మరి.

ఇదే క్రమంలో భారతదేశ వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలను చూపెడుతుంది వేదిక. ఇందుకు, సాగుకు సంబంధించిన నీళ్ళు, విత్తనాలు, ఎరువులు, మొదలైన వాటిని ప్రస్తావించదు. వ్యవసాయాన్ని కార్పోరేటు పరిశ్రమగా మార్చాలి, వ్యవసాయ నిర్వహణా సామర్థ్యం (Entrepreneurial efficiency) పెరగడం వల్లనే వ్యవసాయరంగ ఆదాయం పెరుగుతుందంటుంది. అంటే వ్యవసాయ రంగానికి సంబంధించిన విత్తనాలు, పరికరాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు మొదలైన అన్ని ఉత్పాదకాల (inputs)ను బడా ప్రైవేటు కార్పోరేటు దిగ్గజాలే ఉత్పత్తి చేస్తున్నాయని, అందువల్లనే వ్యవసాయ సంక్షోభం ఏర్పడిందన్న వాస్తవాన్ని గుర్తించదు. పైగా, ఇక సాగు చేయటాన్ని కూడా ఎట్లా కార్పోరేటీకరించాలన్నది సమస్య. అందుకు భూ సంస్కరణలకు పూర్తిగా విరుద్ధమైన భూ పంపిణీ చట్టాలను ఇది ప్రతిపాదిస్తుంది, మద్దతునిస్తుంది. ఈ క్రమంలోనే సాగుభూమి చట్టాలను సరళీకరించ డానికి, సాగుభూమిని మార్కెటు సరుకుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. సాగుభూమి ఎప్పుడైతే కార్పోరేటు శక్తుల స్వాధీన మవుతుందో, అప్పుడు కాంట్రాక్ట్ ఫార్మింగ్ (contract farming) ఆవిష్కరించబడుతుంది. చిన్నా చితక రైతులు, రైతుకూలీలుగా మారేపరిస్థితి ఏర్పడుతుంది. రైతును రైతుకూలీగా మార్చడం సమ్మిళిత వృద్ధి అవుతుందా?

ఇక సాగుభూమిని స్వాధీనం చేసుకుని కార్పోరేటు పెట్టుబడులు, తన నిర్వహణా సామర్థ్యంతో వ్యవసాయిక ఆదాయాన్ని పెంచగల్గుతాయి. అయితే ఎవరి ఆదాయం పెరుగుతుందన్నది ప్రశ్న, రైతు స్థితి హీనమైంది. సాగుభూమిని ఆక్రమించిన కార్పోరేటు పెట్టుబడుల ఆదాయం పెరిగింది. ఇది వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమా? ఈ క్రమంలో వ్యవసాయాన్ని ఆశ్రయించి బతుకుతున్న వాళ్ళందరికీ ఉపాధి దొరకదు. వలసబాట పట్టక తప్పదు. వలస వచ్చిన శ్రామికులను మరింత దోచుకొని అభివృద్ధి చెందడానికి వీలుంటుంది. ఇట్లా ఈ వేదిక ప్రతిపాదించే ప్రతీ పరిష్కారంలో కార్పోరేటు పెట్టుబడుల లాభాలను పెంచడం, శ్రమ దోపిడీని తీవ్రతరం చేయడం తప్పకుండా వుంటాయి.

ఇంకా ఈ వేదిక, గ్లోబల్ పోటీతత్వ నివేదికను (Global competitiveness) రూపొందిస్తుంది. సుస్థిరమైన సమ్మిళిత వృద్ధి కోసం వాణిజ్యం, ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలనిది సూచిస్తుంది. అసమర్థ ప్రభుత్వాలు స్వతంత్రంగా ఏమీ చేయలేవు. కనుక ప్రైవేటు రంగంలో ప్రధానంగా కార్పోరేటు పెట్టుబడులతో పొత్తు అవసరం అంటూ ప్రైవేటు – పబ్లిక్ భాగస్వామ్యాన్ని (Public-private partnership) తప్పనిసరి అంటుంది. ఇందుకు ప్రత్యామ్నాయం లేదంటుంది. ఈ సాధనం వల్ల ప్రభుత్వరంగం నుండి ప్రైవేటుకు సంపద భారీఎత్తున తరలివెళ్తుందని, ప్రజలకు అపారనష్టం అని, కార్పోరేటు శక్తులు లాభపడడానికి కూడా బలమైన సాధనమని అందరికీ తెల్సిందే, నిరూపించబడింది. కాని ఈ సాధనాన్ని సమర్థవంతమైనదని ఈ వేదిక బలంగా ప్రతిపాదిస్తుంది.

దానిని వివిధ రంగాలలో అమలు చేయడానికి ఈ వేదిక చొరవతో వర్ధమాన దేశాలలో ఎన్నో కార్యక్రమాలు ప్రారంభమైనాయి. వార్షిక సదస్సుతో పాటు వర్ధమాన దేశాలలో ప్రధానంగా, ఇండియా, చైనా, ఆఫ్రికా, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్‌లో ప్రాంతీయ సమావేశాలను నిర్వహిస్తుంది. తన ప్రతిపాదనలు గొప్పవి అని ప్రచారం చేస్తుంది.

## ప్రపంచ ఆర్థికవేదిక నిర్ణయాలలో కీలక స్థానం ఎవరికి వుంటుంది?

గ్లోబల్ సమస్యల సుస్థిర పరిష్కారానికి భవిష్యత్ పరిశ్రమ ఏరూపంలో వుండాలో నిర్ణయించడంలో కీలకస్థానం పునాది సభ్యులదే (Foundation Members). ప్రపంచ ఆర్థిక వేదికలో పునాది సభ్యత్వం గల 1000 కంపెనీల నుండి ఈ సభ్యులుంటారు. వీరితోపాటు ప్రపంచాన్ని "మెరుగు పరచడానికి" (వీరి దృష్టిలో ప్రపంచం అంటే బడా కార్పోరేటు, వాణిజ్యశక్తులే), గ్లోబల్ కంపెనీలలో ఆధిపత్యస్థానంలో వున్న 100 కంపెనీల సమూహం నుండి వ్యూహాత్మక భాగస్వాములు (Strategic partners) ఎంపిక చేసుకోబడతారు. ప్రపంచ ఆర్థికవేదిక సభ్యత్వం గల కంపెనీల నుండి పారిశ్రామిక భాగస్వాములను (Industrial partners) ఎంపిక చేసుకుంటారు. మళ్ళీ పరిశ్రమ స్థాయిలో నిర్ణయాలను తీసుకుంటారు. ఇంకా ప్రపంచ ఆర్థిక వేదికకు మేథోపరమైన నాయకత్వ సహకారాన్ని అందిస్తూ, ప్రపంచ వాణిజ్య సమస్యలను చర్చించడానికి 120 మందితో ఉన్నతస్థాయి కార్యనిర్వాహక వర్గంతో అంతర్జాతీయ బిజినెస్ కౌన్సిల్ పనిచేస్తుంది. అత్యధిక వృద్ధితో ఆధిపత్య స్థానంలో వున్న ఔత్సాహిక కార్పోరేటు సంస్థలలో భవిష్యత్ గ్లోబల్ ఆర్థికవ్యవస్థను శాసించే శక్తివంతమైన పారిశ్రామిక నాయకత్వాన్ని తయారుచేసే లక్ష్యంతో ఈ కౌన్సిల్ నిర్వహణ కొనసాగుతుంది. ఇక ప్రజల దృష్టిని మళ్ళించడానికి మతసంస్థలు, శక్తివంతమైన మీడియా, ప్రపంచ ఆర్థికవేదిక చట్రంలో పనిచేసే అనేకానేక స్వచ్ఛంద సంస్థలు వుండనే వున్నాయి. ప్రపంచ ఆర్థికవేదిక అంటేనే ప్రపంచంలోని అత్యున్నతస్థాయి సంపన్న వర్గానికి చెందిన వేదిక. ఇందులోని సభ్యులు ప్రపంచాన్ని శాసించగల శక్తివంతులమన్న (Masters of Universe) అహంకారంతో వుంటారన్నది వాస్తవమే కదా! బడాకార్పోరేటు శక్తుల, వాణిజ్య నాయకుల సంపదను మరింత పెంచడానికి, వారి ఆధిపత్యాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి, శ్రమదోపిడీ, పీడనలను తీవ్రతరం చేయడానికి శక్తివంతంగా కృషి చేసే వేదిక ఇది. అందుకే ఈ వేదికను "ప్రపంచీకరణ యొక్క మాఫియోక్రసీ" (Globalization Mafiocracy) గా విమర్శించడం సరియైనదే కదా! గూగీ వా థియాంగో 'మట్టికాళ్ళ మహారాక్షసి' నవలలో చెప్పినట్టు బందిపోట్లు, గజదొంగలు, దోపిడీ దొంగలు గుహలో తమ దోపిడీని

కొనసాగించడానికి సమావేశమై చర్చలు చేసే విషయాన్ని చెప్పడం ఈ సందర్భంగా గుర్తుకు రావడం సహజమే. వాణిజ్యం నిరాటంకంగా కొనసాగటానికి వీలులేనట్లయితే యుద్ధాలు తప్పవు అంటుందీ వేదిక.

అంటే ఏమిటి? శ్రమదోపిడీ నిరాటంకంగా కొనసాగించబడాలి, పెరగాలి కూడా. అప్పుడు కార్పోరేటు దిగ్గజాల, వాణిజ్యశక్తుల సంపద నిరాటంకంగా పెరుగుతూనే వుంటుంది. శ్రమజీవు లందరూ దుర్భరమైన పరిస్థితులలో జీవించక తప్పదు. దీనికి తోడు, కార్పోరేటు శక్తుల పర్యావరణ దోపిడీ వల్ల రకరకాల కాలుష్యాలతో పర్యావరణం కలుషితమై పీడితవర్గం మరింత సంక్షోభంలో పడింది. కానీ ఈ వేదిక "సముద్రాలను రక్షించుకోవాలి" అని నినదిస్తుంది. సముద్రాలను నాశనం చేస్తున్నదెవ్వరు? ఎవరి లాభం కోసం పర్యావరణం మొత్తం నాశనమవు తున్నది? పర్యావరణాన్ని రక్షించుకోవాలని బడా కార్పోరేటుశక్తులు, ప్రభుత్వాలు అంతర్జాతీయ సమావేశాలు నిర్వహిస్తాయి, ప్రపంచ ఆర్థికవేదిక సదస్సులో మాట్లాడతాయి. కాని వేదాంత గ్రూపుకు చెందిన స్టెరిలైట్ కంపెనీని, అది సృష్టిస్తున్న కాలుష్యం దృష్ట్యా, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న దృష్ట్యా, చట్టపరంగానే ఆపడానికి తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రజలు పోరాటాలు చేయాలి, ప్రాణాలు కోల్పోవాలి. పర్యావరణాన్ని రక్షించేదెవ్వరు? నాశనం చేసేదెవ్వరు? అన్న విషయం స్పష్టం కావడానికి ఈ ఒక్క సంఘటన చాలు. కార్పోరేటు పెట్టుబడులు, ప్రభుత్వాలు ఎటువైపో తేలిపోతుంది.

ఈ దోపిడీని కొనసాగనివ్వకపోతే యుద్ధాలు తప్పవు అనడం చూస్తే వాణిజ్యీకరణను బలోపేతం చేస్తున్న శక్తుల దౌర్జన్యం, దుర్మార్గం, కౄరత్వం స్పష్టమవుతుంది. ఇరుగు పొరుగు దేశాల మధ్య సఖ్యత వుండాలని ఈ వేదిక చెప్పడం మరొక వైరుధ్యం.

ఈ దోపిడీ వ్యవస్థ ఎట్లా కొనసాగుతుంది? ఇందుకు అనుగుణమైన ఆర్థిక నిర్మాణాలను, సంస్కృతిని, ఆలోచనా విధానాన్ని పకడ్బందీగా రూపొందించుకోవాలి. నయా ఉదారవాద విధానాల అమలు విజయవంతమవుతూ, గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ, సూపర్ గ్లోబలైజేషన్ రూపం తీసుకున్న క్రమంలో విస్తారమైన, బలమైన దళారీ వ్యవస్థ ఏర్పడింది. దోపిడీ, పీడన, మోసం, దగా, హింస వ్యవస్థీకృతమైనాయి. అందరూ పీడితులే, అందరూ దళారులే అన్నట్లుగా సమాజం రూపం తీసుకున్నది. అసంఖ్యాకమైన పీడిత వర్గానికి చెందిన యువతకు గౌరవంగా బ్రతకటానికి అవకాశాలే లేవు. సంపాదన వుండదు. కళ్ళముందు ఆధిపత్యవర్గం యొక్క ఆడంబర జీవితం కనిపిస్తుంది. మీడియా ద్వారా అందరి ఇళ్లల్లో కనిపిస్తుంది, ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఈ ఒక్క బలహీనత చాలు ఆధిపత్యవర్గ మాఫియోక్రసీ ఈ యువతను మొత్తంగా తాము సృష్టిస్తున్న నేర ప్రపంచానికి కార్యకర్తలుగా మలవడానికి. నేరం వ్యవస్థీకృతమవుతుంది. దళారీ వ్యవస్థలో భాగంగా అందరూ నేరస్తులే అవుతారు. నిచ్చెనమెట్ల సామాజికార్థిక నిర్మాణాలు మరింత బలపడతాయి. నేరం చేయక తప్పదు. కాబట్టి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పరిష్కారం లభిస్తుందన్న ప్రచారం ముమ్మరమైంది. అందుకే బలమైన మతాధికారులు కూడా ప్రపంచ ఆర్థికవేదికలో సభ్యులే. సామాజికార్థిక నిర్మాణాలలో అశాంతి వ్యవస్థీకృతమవుతుంది. కాని ధ్యానం, యోగా అంటూ వైయక్తిక పరిష్కార మార్గాలు ముందుకొస్తున్నాయి. దోపిడీ కొనసాగుతూనే వుంటుంది. సమాంతరంగా మత కార్యకలాపాలు కూడా ముమ్మర మవుతాయి. అసమసమాజంలో 'దానం' గొప్ప విలువ అవుతుంది. దోచుకున్న సంపదను ఎవరి నుండైతే సంపదను దోచుకున్నారో వాళ్ళకే దానం చేయడం, దానాన్ని స్వీకరించిన పీడిత వర్గం, ఇక ఆధిపత్యవర్గం పట్ల వినయ విధేయతలతో, అణిగిమణిగి వుండాల్సిందే. ఆ సంపన్నుడు బాగా దానధర్మాలు చేస్తాడని, దాతృత్వం ఎక్కువని, మంచివాడని ప్రచారమవుతాడు. సంపద ఎట్లా సమకూడింది? దాతృత్వం, దానధర్మాలు, పూజలు, యాగాల వెనుక దోపిడీ, అవినీతి, నేరాలు, ఘోరాలు అన్నీ మరుగునపడతాయి, అదృశ్య మవుతాయి.

దోపిడీ వ్యవస్థలో బలంగా భాగస్వాములు కావడం, వివిధ మతాధికారుల ప్రవచనాలు వినడం, పూజలు, వ్రతాలు వంటి క్రతువులు చేయడం, నేరం చేసి పట్టుబడమన్న ధీమా (మన చట్టాలు బలవంతుణ్ణి శిక్షించలేవు కనుక), అయినా ఏదో తెలియని భయాల వల్ల ఏర్పడే అనిశ్చిత పరిస్థితి వల్ల తాంత్రిక పూజలు, బలివ్వడం, తాయత్తులు, రాళ్ళు, వాస్తు, పేరులోని అక్షరాలను మార్చుకోవడం, డేరాబాబాలు, ఆశారాం బాపూలు పుట్టుకురావడం – ఇదంతా గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీని, మెజారిటీ ప్రజల జీవన విధ్వంసాన్ని ప్రశ్నించకుండా వుండడానికి సృష్టించబడిన మాయా లోకం.

దీనితో బ్రాహ్మణాధిక్యత పెరిగింది. కుల వివక్ష పెరిగింది. కులం పేరిట అంతరాలు పెరిగాయి. దళితుల, ఆదివాసీల మీద దాడులూ పెరిగాయి. ఆధిపత్య వర్గానికి, రాజకీయాధికారం తోడైతే, తన మాట ఎవరూ కాదనడానికి వీల్లేదంటారు. తన మాటని లెక్క చేయని, నిజాయితీ గల ఎంత పెద్ద ఆఫీసర్నైనా నడిరోడ్డున కొడతారు, రోడ్డు మీద తన కారును ఓవర్టేక్ చేసినా సహించలేరు, చంపుతారు గూడా. దీన్ని ప్రశ్నించే తత్వమే చచ్చి పోతుంది. గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ నిరాటంకంగా కొనసాగడానికి ఇటువంటి సమాజమే కావాలి మరి. దీనిని బలోపేతం చేయడానికే ప్రపంచ ఆర్థికవేదిక సదస్సులో మతాధిపత్యవర్గానికి సంబంధించిన పెద్దలు, శక్తివంతమైన మీడియా ప్రతినిధులు భాగస్వాము లవుతారు. హీన సంస్కృతిని పెంచి పోషించడంలో మీడియా బలమైన పాత్రనే పోషిస్తున్నది. ఈ విష వలయంలో పతనసంస్కృతి వ్యవస్థీకృతమవుతుంది.

ఈ హీనసంస్కృతిలో భాగంగానే స్త్రీ భోగ వస్తువైంది. బలవంతంగానైనా, ఐచ్ఛికంగానైనా భోగవస్తువుగా తనను తాను మలచుకునే పరిస్థితులు సృష్టించబడతాయి. ఇది గొప్ప విషయమని ప్రచారమవుతుంది. 'నేను సన్నిలియోన్ని అవుతా' అన్న సినిమాలూ వస్తాయి. మా ఇష్టం, మా జీవితం, మా స్వేచ్ఛ అన్న భావనలను బలంగా ప్రచారం చేస్తూ స్వచ్ఛంద సంస్థలూ ఈ స్థితిని బలోపేతం చేయడానికి ముందుకువస్తాయి. ప్రపంచ ఆర్థికవేదిక చట్రంలో ఇవి పనిచేస్తాయి. కాబట్టి ఈ వేదికలో ఈ సంస్థలకు ముఖ్యమైన స్థానం వుంది మరి. ఈ క్రమంలో పసిపిల్లల స్థాయి నుండి ఏ వయస్సు ఆడవాళ్ళ మీదనైనా లైంగిక దాడులు

నిత్యకృత్యమైనాయి. ఆడపిల్లలకు భద్రత అన్నదే లేదు. ఎక్కడా లేదు, ఏ సమయంలో లేదు, ఏ వయస్సులో లేదు – ఎంత దిగజారిన సంస్కృతి ఇది. మరొకవైపు ఆడపిల్లలను మోసం చేయడం ఎక్కువైంది; వేరే కులం వాణ్ణి ప్రేమించినా, పెళ్ళి చేసుకున్నా తల్లిదండ్రులే చంపే పరువుహత్యలూ పెరిగాయి. మరి కుల భావన బలపడింది కదా! ఇంకా స్త్రీల పాతివ్రత్యానికి సంబంధించిన కఠిన నియమాలు, నిరూపణకు పరీక్షలూ ఎక్కువైనాయి. ఎన్నో వైరుధ్యాలతో సృష్టించబడిన గందరగోళ పరిస్థితులలో స్త్రీ జీవితమే భయంకరమైన సంక్షోభంలో పడింది.

మొత్తం మానవత్వ సంక్షోభం. పతన విలువలు ఆమోదయోగ్యమైనాయి. ప్రధాన ప్రవంతి కార్యకలాపాలైనాయి. ఎవరు, ఎవరిని ప్రశ్నించాలో తెలియని స్థితి. ఎవ్వరూ, తమ పక్క వాళ్ళనే విశ్వసించలేని స్థితికి, సమిష్టితత్వమే నామరూపాలు లేకుండా పోయే స్థితి బలపడుతున్నది. దీనివల్ల ఆధిపత్య వర్గానికి నిశ్చింత, ప్రశాంతత. ఆ వర్గం మనుగడ, అభివృద్ధి రెండూ సమాజ విధ్వంసంతోనే ముడిపడి వున్నాయని దీనితో స్పష్టమవుతుంది.

**ఈ దోపిడీ వ్యవస్థ ఇట్లా కొనసాగ వలసిందేనా అన్నది మన ముందున్న సీరియస్ ప్రశ్న.**

స్వతంత్ర భారతదేశ పాలకవ్యవస్థ, ప్రారంభం నుండీ సామ్రాజ్యవాద శక్తుల దళారీగా నయా ఉదారవాద విధానాలను ప్రచ్ఛన్నంగా, ఇప్పుడు బాహాటంగా అమలు చేస్తూనే వున్నది. స్వతంత్రం వచ్చిన ఒకటిన్నర దశాబ్దంకే, 1970లోనే ఈ విధానాల ఫలితంగా భారతదేశ ఆర్థికనిర్మాణాలు వక్రీకరణకు గురైనాయని, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిగారు తన సునిశిత పరిశీలన, అధ్యయనంలో గుర్తించాడు. 'తాకట్టులో భారతదేశం' వుందంటూ ఆవేదనతో ఆవేశంతో ప్రశ్నించిన విషయం మనందరికీ తెలుసు. ఆ తర్వాత కాలంలో ఆ వక్రీకరణ మరింత బలపడి 'అమ్ముడుపోయిన భారతదేశం' అయింది. గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ బలోపేతం కావటమే ఇందుకు కారణం. దీనికి మరొక పార్శ్వమే మెజారిటీ పీడిత ప్రజలు దుర్భర పరిస్థితులలో జీవించడమే. ఈ విషయాన్ని 150 సం॥రాల క్రితమే కారల్‌మార్క్స్ శాస్త్రీయంగా అంచనా వేసారు. ఈ అంచనాలు, ఖచ్చితమైన వాస్తవాలుగా స్పష్టంగా మనకు కనిపిస్తున్న సందర్భం ఇది.

శ్రమశక్తి సృష్టించిన అపారమైన సంపద ఇది. శ్రమదోపిడీని అంతమొందిస్తేనే, ఈ సంపద హక్కుగా శ్రామికవర్గానికి లభిస్తుంది. శ్రమదోపిడీ, అసలు మొత్తంగా దోపిడీ వ్యవస్థ ఎట్లా అంతం అవుతుంది? పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రంలో ఈ దిశగా తీసుకున్న ప్రతీ సంస్కరణ చర్య వల్ల దోపిడీ పెరిగిందే కాని తగ్గలేదు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రంలో సమస్య పరిష్కరించబడడానికి వీలుండదంటాడు మార్క్స్. బలమైన వర్గపోరాటాల నిర్మాణంలోనే దోపిడీవ్యవస్థ అంతం ప్రారంభమవుతుందని చెప్పిన మార్క్స్ విముక్తి మార్గం, లెనిన్ ఆచరణమార్గం, ఆచరణ వాస్తవం కావాలి. అందుకు దోపిడీ పీడన, వివక్ష, హింస, మోసం, దగాలేని సమాజ ఆవిష్కరణ కోసం కృషి చేసే శక్తులన్నీ ఏకం కావాలి. ఉధృతమైన పోరాటాలను నిర్మించాలి. గుత్తాధిపత్య శక్తులను అంతమొందించాలి. మానవత్వ సంక్షోభం పట్ల ఇంక ఉదాసీనంగా వుండడం తగదు.

**References:**


1. Alexander Gray and A.E. Thompson (1931, 1980);
   The Development of Economic Doctrine, 2nd Edition, Long man Group ltd, London and Newyork.
2. Eric Roll (1973): A History of Economic Thought, Baron Roll of ipsden, 1st published in 1938.
3. Geffrey Allen Pigman (2007):
   The WEF: A multi Stake holder Approach to Global Governance, Routledge.
4. Jyothi Rani Thota (2018); Mahilala Jeevana Vidhwasam: Samijika Arthika Mulalu in (Telugu), Streevimukthi Sanghatana, Hyderabad and vijayawada.
5. Nagi Reddy Tarimela (1978): India mortgaged - A Marxist - Leninist Appraisal, Tarimela Nagi Reddy Memorial Trust.

**Internet Sources**

1. https://en.m.wikipedia.org/wiki/world -Economic - Forum.
2. sdg. iisd, org.
   SDG knowledge weekly: Davos, inequality and Development Finance, 22, jan, 2018 by Adam Fishman.


*****